RNI NO: APTEL/26/A3560

www.mahinewsindia.com

# మహి న్యూస్

MAHI NEWS

Epaper: https://epaper.mahinewsindia.com

తెలుగు దినపత్రిక



ఆంధ్రప్రదేశ్,తెలంగాణ. సంపుటి : 01 సంచిక : 112 ఎడిటర్ : నీలి రామసుబ్బయ్య, పేజీలు : 4 వెల రూ.2 బుధవారం -02 - సెప్టెంబర్ - 2026

Published From :Kurnool circulated by YSR Kadapa I Anatapuram I Chittoor I East & West Godavari I Guntur I Krishna I Nellore I Srikakulam I Visakhapatnam I Vijayanagaram I Prakasham & Hyderabad & Telangana

## ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ కీలక భేటీ

- ఇరాన్ అధ్యకక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు.
- కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ సదస్సు సందర్భంగా వారిద్దరు భేటీ అయ్యారు.



బిష్కెక్: ఇరాన్ అధ్యకక్షుడు పెజెష్కియాన్‌తో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సమావేశమయ్యారు. కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై కో-ఆపరేషన్ సదస్సు సందర్భంగా వారిద్దరు భేటీ అయ్యారు. రెండేళ్ల తర్వాత ఇద్దరు నేతలు మిగతా 2లో

## అమెరికాలో పెను విధ్వంసం.. వరదల్లో 20 మంది గల్లంతు!

- అమెరికాలోని ప్రసిద్ధ గ్రాండ్ కేనియన్ నేషనల్ పార్క్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి.
- కేవలం అరగంటలో కురిసిన భారీ వర్షంతో ఉప్పొంగిన వరద ప్రవాహానికి భారీ బండరాళ్లు, ఇనుప నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొట్టుకుపోయాయి.





అమెరికాలోని ప్రసిద్ధ గ్రాండ్ కేనియన్ నేషనల్ పార్క్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టించాయి. కేవలం అరగంటలో కురిసిన భారీ వర్షంతో ఉప్పొంగిన వరద ప్రవాహానికి భారీ బండరాళ్లు, ఇనుప నిర్మాణాలు, ఇతర శిథిలాలు కొట్టుకుపోయాయి. మిగతా 2లో

### భావితరాలకు ఆరోగ్యకరమైన, స్వచ్ఛమైన, పచ్చని

## భవిష్యత్తును అందించడం అందరి బాధ్యత



- 33శాతం పచ్చదనం తప్పనిసరి
- ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు.
- రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు.
- కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు.

ఏపీ ఆర్థిక పురోగతికి పారిశ్రామిక అభివృద్ధి ఎంత ముఖ్యమో, పర్యావరణ పరిరక్షణ కూడా అంతే ముఖ్యమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. రాష్ట్రంలోని అన్ని పరిశ్రమలు పర్యావరణ నిబంధనలను తు.చ. తప్పక పాటించాలని స్పష్టం చేశారు. కాలుష్య నియంత్రణ మండలి మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి పరిశ్రమ తన ప్రాంగణంలో కనీసం 33 శాతం పచ్చదనాన్ని అభివృద్ధి చేసి, సంరక్షించే బాధ్యతను చేపట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి పారిశ్రామికవేత్త మిగతా 2లో

## ముసారాం బ్రిడ్జిని

# ప్రారంభించిన సీఎం రేవంత్

### మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు.

- ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు.
- మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు.
- మూసారాంబాగ్ హైలెవల్ బ్రిడ్జిని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు.
- ఈ బ్రిడ్జిని రూ.52 కోట్ల వ్యయంతో 400 మీటర్ల పొడవుతో నిర్మించగా.. సీఎం నేడు (సోమవారం) ప్రారంభోత్సవం చేశారు.
- మూసీ నదిలో లక్షా యాభై వేల క్యూసెక్కుల వరద వచ్చినా ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా పటిష్ఠంగా దీనిని నిర్మించారు.




మూసారం బాగ్ బ్రిడ్జిని సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. సోమవారం అంబర్‌పేటలో సీఎం రేవంత్ దీనిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఎంతో పాటు ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగారెడ్డి, కాలేరు వెంకటేష్, శ్రీ గణేష్, నవీన్ యాదవ్, బలాల తదితరులు పాల్గొన్నారు. మూసీవరదలతో ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఈ కొత్త బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టారు. లక్ష 50 వేల క్యూసెక్కుల వరద నీటిని తట్టుకునేలా బ్రిడ్జిని నిర్మించారు. మిగతా 2లో

## 'పుట్టింటి నుంచే బయటకు పంపారు'



- బీఆర్ఎస్ సస్పెన్షన్‌పై భావోద్వేగానికి గురైన కవిత
- సభలో కన్నీటి పర్యంతమైన కవిత
- "కవిత సీఎం" అంటూ కార్యకర్తల నినాదాలు
- కొత్త పార్టీ పెట్టడానికి కారణాలు వివరించిన కవిత
- తీహార్ జైలుకు పంపిన వారికి ఎన్నికల్లో సమాధానమిస్తామని ప్రతిన

బీఆర్ఎస్ నుంచి తనను సస్పెండ్ చేయడంపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. పార్టీ కోసం తనను జైలుకు పంపారని పెద్ద నాయకులే చెప్పారని గుర్తు చేశారు. ఆ తర్వాత అదే పార్టీ నుంచి తనను బయటకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. "నాతో ఎందుకు ఇలా చేయాలి?" మిగతా 2లో

## శిలాఫలకమే మీది..

# సంకల్పం, సమగ్ర నిర్మాణం వైఎస్సార్‌ది

### వెలిగొండలో చంద్రబాబు క్రెడిట్ చోరీపై వైఎస్ జగన్ ధ్వజం

- వెలిగొండకు ప్రాణం 37.587 కిలోమీటర్ల జంట సొరంగాలు
- కీలక జంట సొరంగాలు పూర్తి చేసిన ఘనత మా ప్రభుత్వానిదే
- ఇప్పుడు జరుగుతున్నది.. మీ క్రెడిట్ చోరీనే బాబూ
- మీరు, మీ అనుకూల మీడియా ఎంతగా చరిత్రను వక్రీకరించినా వాస్తవాలు మారవు
- ప్రచార ఆర్భాటాన్ని పక్కన పెట్టి.. నల్లమలసాగర్‌ను నింపి, రైతులకు సాగునీరు ఇవ్వాలి



వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణ చరిత్రను మార్చేలా కొన్నాళ్లుగా సీఎం చంద్రబాబు చేస్తున్న ప్రచారం, ఎల్లో మీడియా చేస్తున్న హడావుడి.. క్రెడిట్ చోరీ యత్నాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. మిగతా 2లో

### తెలంగాణకు తీరని ద్రోహం

### - మన ప్రాజెక్టులు ఎండిపోతున్నాయ్



- కృష్ణా నీటి దోపిడీపై సీఎం రేవంత్ మౌనం
- కేఆర్ఎంబీ ప్రేక్షకపాత్ర
- తక్షణమే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించాలి
- వెలిగొండకు కృష్ణా జలాల తరలింపుపై రేవంత్ ప్రభుత్వంపై హరీశ్ రావు విమర్శలు
- తెలంగాణ ప్రాజెక్టులు ఎండిపోతున్నా ఏపీకి నీళ్లు ఇస్తున్నారని ఆరోపణ

వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాలను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మిగతా 2లో

## రెండు దశల్లో నిర్మాణం..

# 2028 నాటికి తొలి దశ పూర్తి

### విశాఖకు ఏఐజీ.. రూ.2,000 కోట్లతో వెయ్యి పడకల హాస్పిటల్..

- విశాఖలో ఏఐజీ హాస్పిటల్ నిర్మాణానికి మంత్రి లోకేశ్ శంకుస్థాపన
- వెలిగొండపై మాటల యుద్ధం.. జగన్ కు లోకేశ్ కౌంటర్
- వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవం... టీడీపీ, వైసీపీ విమర్శల పర్వం
- నీళ్లు లేకుండానే జగన్ ప్రాజెక్టును ప్రారంభించారంటూ లోకేశ్ ఎద్దేవా
- తొలి దశ పూర్తి చేసి నల్లమల సాగర్‌లోకి నీటిని విడుదల చేసిన చంద్రబాబు



ఉమ్మడి ప్రకాశం జిల్లా పశ్చిమ ప్రాంతంతో పాటు నెల్లూరు, కడప జిల్లాల్లోని పలు వెనుకబడిన ప్రాంతాల దశాబ్దాల కలను సాకారం చేసే వెలిగొండ ప్రాజెక్టు, మిగతా 2లో

### తెలంగాణలో తొలిసారిగా

## కవచ్ ప్రాజెక్ట్‌ను అమలు చేస్తున్నాం



- తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు.
- కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు.
- మహబూబ్‌నగర్ జిల్లాలో ఆధునికీకరణ పనులు కొనసాగుతున్న రైల్వేస్టేషన్ పనులను కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ డీకే అరుణ పరిశీలించారు.

తెలంగాణ రాష్ట్రంలోని రైల్వేల అభివృద్ధికి అంకితభావంతో తాము పనిచేస్తున్నామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. కొత్త రైల్వే ట్రాక్‌లు, వాటిని ఉన్నతీకరణ చేసే విధంగా మిగతా 2లో

### వెలిగొండ ప్రాజెక్టు జాతికి అంకితం చేశామని

# డ్రామా ఆడారు

### వాళ్లు కూడా అంతే సంతోషంగా ఉండాలి

- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభం
- నాడు పునాది వేసిన తానే నేడు ప్రారంభించడం అదృష్టమన్న సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వం ఫేక్ ప్రారంభోత్సవంతో ప్రజలను మోసం చేసిందని తీవ్ర విమర్శ
- 2028 నాటికి రెండో దశ పూర్తి చేస్తామని, మార్కాపురం జిల్లా ఇస్తామని హామీ
- నదుల అనుసంధానంతోనే దేశంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారమన్న ముఖ్యమంత్రి
- జగన్ హయాంలో వెలిగొండ ప్రాజెక్ట్‌కు గ్రహణం పట్టింది: సీఎం చంద్రబాబు
- ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు.
- నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు.



ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజల మూడు దశాబ్దాల కలను సాకారం చేస్తూ, కరవు నేలపై కృష్ణమ్మ పరుగులకు శ్రీకారం చుడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశను జాతికి అంకితం చేశారు. నల్లమల సాగర్‌లోకి కృష్ణా జలాలను విడుదల చేసి, ఈ చారిత్రక ఘట్టానికి నాంది పలికారు. ఈ సందర్భంగా మిగతా 2లో

## "కరోనా కాలంలోనూ వైఎస్ జగన్ వెలిగొండ పనులను ఆపలేదు"




- కరోనా కాలంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు పనులను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు.
- వెలిగొండ ప్రాజెక్టు ఘనత వైఎస్సార్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని చెప్పారు.

నెల్లూరు: కరోనా కాలంలో కూడా వెలిగొండ ప్రాజెక్టు పనులను వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆపలేదని మాజీ మంత్రి అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. మిగతా 2లో

RNI : APTEL/25/A0105 www.mahinewsindia.com

మహి న్యూస్

epaper: https://epaper.mahinewsindia.com తెలుగు దినపత్రిక



# జాతీయ లోక్‌అదాలత్‌పై పోలీసు అధికారులతో ముందస్తు సమావేశం

### కడప జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్ప మొక్క అందజేసి స్వాగతం



కడప, సెప్టెంబర్ 1: మహి న్యూస్: ఈ నెల 12న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌ను విజయవంతం చేసేందుకు పోలీసు అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, అమరావతి ఆదేశాల మేరకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, ప్రధాన జిల్లా న్యాయమూర్తి జి. రామ గోపాల్ ఆధ్వర్యంలో న్యాయ సేవా సదన్‌లో ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రధాన జిల్లా న్యాయమూర్తికి అధికారులు పుష్ప మొక్కను అందజేసి స్వాగతం పలికారు. ఈ నెల 12న జరగనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో రాజీకి అవకాశం ఉన్న కేసులను ఎక్కువ సంఖ్యలో పరిష్కరించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రధాన జిల్లా న్యాయమూర్తి సూచించారు. అలాగే ఆంధ్రప్రదేశ్ హైకోర్టు డబ్ల్యూ.పీ. నం.116/2024, 26-11-2025 ఆదేశాల మేరకు ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి పెండింగ్‌లో ఉన్న చలానాలను కూడా ఈ నెల 12న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌లో సంబంధిత బెంచ్ ద్వారా పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు. ఈ సమావేశంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి ఎస్. బాబా ఫక్రుద్దీన్, ప్రొద్దుటూరు ఏఎస్పీ, కడప, అన్నమయ్య, తిరుపతి జిల్లాల డీఎస్పీలు, ఇతర న్యాయ, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక తనిఖీ

### రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా.. సమస్యలు, వసతుల కొరతపై వైద్యులతో చర్చ



కడప జిల్లా/జమ్మలమడుగు, సెప్టెంబర్ 1: మహి న్యూస్: జమ్మలమడుగు ప్రభుత్వ వైద్యశాలను శాసనసభ్యులు ఆదినారాయణ రెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షులు భూపేష్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు రాజేష్ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించిన వారు రోగులకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. అనంతరం వైద్యులతో ప్రత్యేకంగా సమావేశమై ఆసుపత్రిలో ప్రస్తుతం నెలకొన్న సమస్యలు, వసతుల కొరత, రోగులకు ఎదురవుతున్న ఇబ్బందులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా అవసరమైన చర్యలు చేపట్టాలని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ నాగేశ్వర్ రెడ్డి, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## అమరావతి ఛాంపియన్‌షిప్--2026లో

# అన్నమయ్య జిల్లా క్రీడాకారుల సత్తా

### క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్.



మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 1: అమరావతి ఛాంపియన్‌షిప్--2026 రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లోఅన్నమయ్య జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. వివిధ క్రీడాంశాల్లో అత్యుత్తమ ప్రదర్శనతో జిల్లా కీర్తిని రాష్ట్ర స్థాయిలో చాటారు. వివిధ క్రీడాంశాల్లో రాణించిన క్రీడాకారులు బ్యాడ్మింటన్‌లో మోతుకూరి కళ్యాణి, కందుకూరి లక్ష్మీ సింధూర ద్వితీయ స్థానాలు సాధించి రజత పతకాలు పొందారు. బాక్సింగ్‌లో సిరివెలు నిఖిల్ దేవ్ నాయుడు ద్వితీయ స్థానం సాధించగా, అథ్లెటిక్స్‌లో జావెలిన్ త్రో విభాగంలో సుంకు గంగాధర్ ద్వితీయ స్థానం సాధించి రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. క్రీడాకారులను అభినందించిన జిల్లా కలెక్టర్ పతకాలు సాధించిన క్రీడాకారులు తమ మెడల్స్‌తో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ని మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఛాంబర్ నందు మర్యాదపూర్వకంగా కలిసి తమ విజయాలను తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ క్రీడాకారులను అభినందించి, వారి ప్రతిభను ప్రశంసించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి అన్నమయ్య జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.

క్రీడాకారులకు అవసరమైన సహకారం

అమరావతి ఛాంపియన్‌షిప్--2026లో జిల్లా క్రీడాకారులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించడం ఎంతో ఆనందంగా ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ తరఫున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

పతకాలు సాధించిన క్రీడాకారులు

మోతుకూరి కళ్యాణి -- బ్యాడ్మింటన్ -- ద్వితీయ స్థానం ?

కందుకూరి లక్ష్మీ సింధూర -- బ్యాడ్మింటన్ -- ద్వితీయ స్థానం ?

సిరివెలు నిఖిల్ దేవ్ నాయుడు -- బాక్సింగ్ -- ద్వితీయ స్థానం?

సుంకు గంగాధర్ -- జావెలిన్ త్రో -- ద్వితీయ స్థానం ?

ఈ కార్యక్రమంలో డీఎస్డీఓ చంద్రశేఖర్, క్రీడాకారులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## నైపుణ్యం పోర్టల్‌లో ప్రతి విద్యార్థి

# తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి




మదనపల్లె, మహి న్యూస్, సెప్టెంబర్ 01: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (ఏపీఎస్డీసీ) ఆధ్వర్యంలో యువతకు నైపుణ్య శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను ఒకే వేదికపై అందించేందుకు 'నైపుణ్యం (నైపుణ్యం) పోర్టల్' ను అందుబాటులోకి తీసుకువచ్చిందని అన్నమయ్య జిల్లా ఉపాధి మరియు నైపుణ్య అధికారి (డెసో) హెచ్. దొన్నప్ప ఒక ప్రకటనలో తెలిపారు.

విద్యార్థులు, నిరుద్యోగ యువత తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత ప్రతి ఒక్కరూ నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు. పోర్టల్‌లో నమోదు చేసుకోవడం ద్వారా అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలు, ధ్రువపత్రాలు, అనుభవం, రెజ్యూమ్, కెరీర్ ప్రాధాన్యతలకు సంబంధించిన వివరాలను నమోదు చేసుకోవచ్చని తెలిపారు. దీని ద్వారా అభ్యర్థులకు అనుకూలమైన నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు, జాబ్ మేళాలు, రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లు, ఉద్యోగ అవకాశాలకు సంబంధించిన సమాచారాన్ని పొందవచ్చని పేర్కొన్నారు.

వివరాలను పూర్తిగా నమోదు చేయాలి

నమోదు సమయంలో అభ్యర్థులు తమ ఆధార్ నంబర్, మొబైల్ నంబర్, ఈ-మెయిల్ వివరాలను ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి. అనంతరం కమ్యూనికేషన్ చిరునామా, అత్యున్నత విద్యార్హత, నైపుణ్యాలు, అనుభవం తదితర వివరాలను పూర్తిగా నమోదు చేయాలని సూచించారు. తమ ప్రొఫైల్‌లోని వివరాలను ఎప్పటికప్పుడు నవీకరించుకోవడం ద్వారా అందుబాటులో ఉన్న శిక్షణ, ఉపాధి, ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవచ్చని తెలిపారు.

నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకునే విధానం

1. ఖుఅజూబఅఖుఎ.ఖజూ.స్త్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌ను సందర్శించాలి. 2. 'బిల్డ్ యువర్ రెస్యూమ్' పై క్లిక్ చేయాలి. 3. 12 అంకెల ఆధార్ నంబర్‌ను నమోదు చేసి, ఓటీపీ ద్వారా ధ్రువీకరించాలి. 4. అభ్యర్థి వివరాలు, మొబైల్ నంబర్, ఈ-మెయిల్‌ను ధ్రువీకరించాలి. 5. కమ్యూనికేషన్ చిరునామాను నమోదు చేయాలి. 6. అత్యున్నత విద్యార్హత, నైపుణ్యాలను నమోదు చేయాలి. 7. అనుభవం, కెరీర్ ఆకాంక్షలు, రెజ్యూమ్ వివరాలను పూర్తిగా నమోదు చేయాలి. 8. అనంతరం ప్రభుత్వం అందించే యూజర్‌నేమ్, పాస్‌వర్డ్‌తో సిటిజెన్గా లాగిన్ కావాలి.

కెరీర్‌కు కీలకమైన అడుగు

"నైపుణ్యం పోర్టల్‌లో నమోదు చేసుకోవడం కేవలం రిజిస్ట్రేషన్ మాత్రమే కాదు. యువత తమ కెరీర్, ఉపాధి అవకాశాల వైపు వేసే ముఖ్యమైన అడుగు" అని డెసో దొన్నప్ప తెలిపారు.

నియోజకవర్గాల వారీగా సంప్రదింపు నంబర్లు

– మదనపల్లె: 9553202509, 6301612761, – తంబళ్లపల్లె: 8897776368, 9741432931, – రాయచోటి: 9550104260, 9177143181, – పీలేరు: 7799587687, – పుంగనూరు: 7780599208, అన్నమయ్య జిల్లాలోని విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నైపుణ్యం పోర్టల్‌లో అధిక సంఖ్యలో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

# ఫిర్యాదు లేదు.. కేసు లేదు.. మరి స్టేషన్‌కు ఎందుకు తీసుకెళ్లారు?

### "సీఐ ముందే అదే గదిలో హోంగార్డు ఉన్నాడు".. బాధితుడి వాంగ్మూలంలో కీలక సాక్షి ఎవరు?

### హోంగార్డు శేఖర్‌కు భద్రత కల్పించి స్వతంత్ర విచారణ జరిపితే అసలు నిజం బయటపడుతుందా?




కడప జిల్లా/జమ్మలమడుగు, సెప్టెంబర్ 1: (మహి న్యూస్): ఫిర్యాదు లేదు.. రాతపూర్వక కంప్లైంట్ లేదు.. కేసు నమోదు కాలేదు.. అయినా ఒక సామాన్యుడిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అక్కడ అతని తల్లి, భార్యతో పాటు కుటుంబ సభ్యులను దూషించారన్న ఆరోపణలు వచ్చాయి. ఈ అంశంపై మహి న్యూస్ ఇప్పటికే ప్రశ్నించింది. అయితే ఇప్పటివరకు సంబంధిత అధికారుల నుంచి స్పష్టమైన వివరణ లేదు.. ఖండన లేదు.. విచారణపై సమాచారం లేదు. ఇప్పుడు ఈ వ్యవహారంలో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది.

ఈ ఘటనకు ప్రత్యక్ష సాక్షి ఎవరు?

బాధితుడు చెబుతున్న వివరాల ప్రకారం, తనను పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చిన హోంగార్డు శేఖర్ కూడా అదే గదిలో, సీఐ సమక్షంలో ఉన్నాడని తెలుస్తోంది.

అదే నిజమైతే...

ఆ గదిలో ఏం జరిగింది?

ఎవరు ఏం మాట్లాడారు?

కుటుంబ సభ్యులను ఎవరు దూషించారన్న ఆరోపణలు ఉన్నాయి?

అసలు సంభాషణ ఎలా జరిగింది?

అన్న విషయాలను తెలుసుకోవడంలో శేఖర్ వాంగ్మూలం అత్యంత కీలకంగా మారుతుంది.

సీఐ ముందే ఉన్న హోంగార్డు.. నిజం చెప్పగలడా?

ఇక్కడ మరో ముఖ్యమైన అంశాన్ని అధికారులు పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది.

శేఖర్ ఒక హోంగార్డు. అతను పోలీసు వ్యవస్థలో పనిచేస్తున్న సిబ్బంది.

ఒకవైపు ఉన్నతాధికారిగా సీఐ...

మరోవైపు తనకు విధులు అప్పగించే పోలీసు శాఖ...

ఇలాంటి పరిస్థితిలో ఒక కింది స్థాయి సిబ్బంది తాను చూసిన విషయాన్ని ఎలాంటి ఒత్తిడి లేకుండా, స్వేచ్ఛగా చెప్పగలడా? అన్నది కూడా విచారణలో పరిశీలించాల్సిన అంశమే.

ఇది శేఖర్‌పై అనుమానం వ్యక్తం చేయడం కాదు.

అతను చెప్పే వాంగ్మూలం ఎలాంటి భయం, ఒత్తిడి, ఉద్యోగపరమైన ఆందోళన లేకుండా నమోదు చేయాలి అన్నదే ప్రశ్న.

"ఉద్యోగం పోతుందేమో" అనే భయం ఉండకూడదు!

ఒక హోంగార్డు తన పైఅధికారికి వ్యతిరేకంగా వాస్తవం చెబితే...

తర్వాత తన విధుల్లో ఇబ్బందులు వస్తాయేమో?

తనపై చర్యలు తీసుకుంటారేమో?

తన ఉద్యోగానికి నష్టం జరుగుతుందేమో?

అనే భయం కలిగే అవకాశం లేకుండా స్వతంత్ర వాతావరణంలో వాంగ్మూలం తీసుకోవడం అవసరం.

అందుకే...

హోంగార్డు శేఖర్‌కు తగిన ఉద్యోగ భద్రత కల్పించి, సంబంధిత సీఐ ప్రత్యక్ష నియంత్రణకు దూరంగా ఉంచి, ఉన్నత స్థాయి అధికారుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేయాలి. అవసరమైతే సంబంధిత ఘటనపై స్వతంత్ర అధికారితో విచారణ జరిపించాలి.

అప్పుడు శేఖర్‌కు కూడా...

"నేను చూసింది ఇదే" అని స్వేచ్ఛగా చెప్పే అవకాశం ఉంటుంది.

సీసీ కెమెరాలు ఒకవైపు.. ప్రత్యక్ష సాక్షి మరోవైపు!

ఈ వ్యవహారంలో రెండు కీలక ఆధారాలు ఉండే అవకాశం ఉంది.

1. పోలీస్ స్టేషన్ సీసీ కెమెరా రికార్డింగ్

2. ఘటన సమయంలో అదే గదిలో ఉన్నట్లు చెబుతున్న హోంగార్డు శేఖర్ వాంగ్మూలం

ఈ రెండింటినీ కలిపి పరిశీలిస్తే వాస్తవ పరిస్థితి ఏంటో అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది.

అందుకే ఇప్పుడు ప్రశ్న మరింత సూటిగా మారింది.

సీసీ కెమెరా ఫుటేజీని భద్రపరిచారా?

శేఖర్ వాంగ్మూలం తీసుకున్నారా?

తీసుకుంటే ఎవరి సమక్షంలో తీసుకున్నారు?

అతనిపై ఎలాంటి ఉద్యోగపరమైన ఒత్తిడి లేకుండా వాంగ్మూలం నమోదు చేశారా?

ఫిర్యాదు లేనప్పుడు.. స్టేషన్‌కు తీసుకెళ్లిన ఆధారం ఏమిటి?

ఇదే ఈ మొత్తం వ్యవహారంలో మొదటి ప్రశ్న.

ఎవరు సమాచారం ఇచ్చారు?

ఏ కారణంతో పోలీసులు స్పందించారు?

ఎవరి ఆదేశంతో ఆ వ్యక్తిని స్టేషన్‌కు తీసుకొచ్చారు?

శేఖర్‌ను ఎవరు పంపించారు?

స్టేషన్ డైరీలో ఆ విషయం నమోదైందా?

ఆ వ్యక్తిని తీసుకొచ్చిన సమయం ఏమిటి?

ఇవన్నీ రికార్డుల ద్వారా తేల్చవచ్చు.

అందుకే...

రికార్డులు మాట్లాడాలి.. కెమెరాలు మాట్లాడాలి.. ప్రత్యక్ష సాక్షి మాట్లాడాలి.

అప్పుడు ఎవరి మాట నిజమో వాస్తవం తేలుతుంది.

సీఐపై ఆరోపణలు ఉంటే విచారణ కూడా సీఐ పరిధిలోనే ఉండాలా?

ఇక్కడ మరో కీలక ప్రశ్న.

ఒక అధికారి మీదే ఆరోపణలు వచ్చినప్పుడు...

అదే అధికార పరిధిలో ఉన్న సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకుంటే అవి ఎంతవరకు స్వేచ్ఛాయుతంగా ఉంటాయి?

అందుకే ఈ వ్యవహారంలో సంబంధిత సీఐకి నేరుగా కింద పనిచేసే సిబ్బందిపై ఎలాంటి ప్రభావం ఉండకుండా విచారణ చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

విచారణ అధికారి స్వతంత్రంగా ఉండాలి.

సాక్షికి భద్రత ఉండాలి.

సీసీ కెమెరా ఫుటేజీ భద్రంగా ఉండాలి.

రికార్డులు పరిశీలించాలి.

అప్పుడే నిష్పాక్షికతపై నమ్మకం ఏర్పడుతుంది.

మహి న్యూస్ సూటి ప్రశ్నలు

ఫిర్యాదు లేకపోతే సామాన్యుడిని పోలీస్ స్టేషన్‌కు ఎందుకు తీసుకొచ్చారు?

అతన్ని తీసుకొచ్చింది హోంగార్డు శేఖర్ కాదా?

ఘటన జరిగిన గదిలో శేఖర్ సీఐ సమక్షంలో ఉన్నాడా?

ఉంటే.. అతని వాంగ్మూలాన్ని ఇప్పటివరకు నమోదు చేశారా?

శేఖర్‌కు ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వతంత్రంగా వాంగ్మూలం ఇచ్చే అవకాశం కల్పించారా?

అతని ఉద్యోగ భద్రతపై ఉన్నతాధికారులు హామీ ఇవ్వగలరా?

ఆ రోజు సీసీ కెమెరా ఫుటేజీని భద్రపరిచారా?

స్టేషన్ డైరీలో ఈ ఘటనకు సంబంధించిన నమోదు ఉందా?

కుటుంబ సభ్యులను దూషించారన్న ఆరోపణలపై విచారణ చేపట్టారా?

ఆరోపణలు తప్పైతే అధికారికంగా ఎందుకు ఖండించలేదు?

నిజమైతే బాధ్యులపై చర్య ఎప్పుడు?

ఇది వ్యక్తుల మధ్య వివాదం కాదు.. పోలీస్ వ్యవస్థపై నమ్మకానికి సంబంధించిన ప్రశ్న

ఒక సామాన్యుడి ఆరోపణ నిజమా కాదా అనేది విచారణలో తేలాలి.

కానీ అతని మాట వినకుండా కొట్టిపారేయడం కూడా సరికాదు.

అదే సమయంలో అతని ఆరోపణలను నిర్ధారించకుండా నిజాలుగా ప్రచారం చేయడం కూడా సరికాదు.

అందుకే...

విచారణే మార్గం.

ఆ విచారణలో...

సామాన్యుడి వాంగ్మూలం ఉండాలి.

హోంగార్డు శేఖర్ వాంగ్మూలం ఉండాలి.

సీసీ కెమెరా ఫుటేజీ ఉండాలి.

స్టేషన్ రికార్డులు పరిశీలించాలి.

సంబంధిత పోలీసు సిబ్బంది వాంగ్మూలాలు ఉండాలి.

అప్పుడు నిజం బయటకు వస్తుంది.

మహి న్యూస్ చివరి ప్రశ్న

"ఫిర్యాదు లేదు.. కేసు లేదు.. అయినా స్టేషన్‌కు ఎందుకు?"

"అక్కడ ఏం జరిగింది?"

"సీఐ సమక్షంలో ఉన్న హోంగార్డు శేఖర్ ఏం చూశాడు?"

"శేఖర్‌కు ఎలాంటి ఒత్తిడి లేకుండా నిజం చెప్పే అవకాశం కల్పిస్తారా?"

"సీసీ కెమెరాలు, రికార్డులు, సాక్షి వాంగ్మూలంతో పూర్తి స్థాయి విచారణ జరిపిస్తారా?"

సమాధానం చెప్పాల్సింది మహి న్యూస్ కాదు... సంబంధిత పోలీసు ఉన్నతాధికారులే.

నిజం ఏదైనా బయటకు రావాలి.

తప్పు ఎవరిదైనా చర్య ఉండాలి.

సామాన్యుడి గౌరవానికి రక్షణ ఉండాలి.

మౌనం కాదు.. వాస్తవం కావాలి!

ఆరోపణలు కాదు.. ఆధారాలతో నిజం తేలాలి!లిలి

గమనిక: పై కథనంలో పేర్కొన్న అంశాలు సంబంధిత వ్యక్తి తెలిపిన వివరాలు, ఆరోపణల ఆధారంగా ప్రశ్నల రూపంలో పొందుపరచబడ్డాయి. ఆరోపణల వాస్తవికతను సంబంధిత అధికారుల నిష్పాక్షిక విచారణ ద్వారా నిర్ధారించాల్సి ఉంటుంది.

# ప్రభుత్వ సేవల్లో.. సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకం..!

### సమాచార శాఖ జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్





కడప, మహి న్యూస్ సెప్టెంబరు 1: అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పనతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలను ప్రజల ముందుకు తీసుకెళ్లడంలో సమాచార శాఖ పాత్ర అత్యంత కీలకమని జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ అన్నారు. మంగళవారం కడపలోని జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖ కార్యాలయాన్ని.. జోన్-4 ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్ తనిఖీ చేశారు. కార్యాలయంలోని పరిపాలనా అంశాలను పరిశీలించి, శాఖాపరంగా నిర్వహిస్తున్న కార్యకలాపాలు, సిబ్బంది విధులపై వివరాలను తెలుసుకున్నారు. అనంతరం కార్యాలయ అధికారులు, సిబ్బందితో సమావేశమై వారి విధులు, బాధ్యతలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో సమాచార శాఖ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. ముఖ్యంగా అక్షరాస్యత పెంపు, పేదరిక నిర్మూలన, వ్యవసాయాభివృద్ధి, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి రంగాల్లో ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు, వాటి ప్రయోజనాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రస్తుత కాలంలో సామాజిక మాధ్యమాలు సమాచార వ్యాప్తికి కీలక వేదికలుగా మారాయని, ఫేస్‌బుక్, యూట్యూబ్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు, వాటిలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచేలా సమాచారాన్ని అందించాలన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, పాత్రికేయుల మధ్య సమన్వయం మరింత బలోపేతం కావాలని కోరారు. జోన్-4 పరిధిలో సమాచార శాఖను మరింత పటిష్ఠం చేయడంతో పాటు పాత్రికేయులకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. సిబ్బంది తమ విధులను బాధ్యతతో నిర్వర్తిస్తూ శాఖ ప్రతిష్ఠను పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా ఏడి రమేష్, డీఇఇ శ్రీనివాసరావు, పిఆర్వో రవికుమార్, ఏవీఎస్ నాగయ్య, సీనియర్ అసిస్టెంట్ మహబూబ్ బాషా తదితరులు ఆర్జేడీ ఎం. వెంకటేశ్వర ప్రసాద్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, దుశ్శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్ఫర్మేషన్ టెక్నీషియన్లు సదాశివయ్య, ఫోటోగ్రాఫర్ సొహైల్, టైపిస్టులు శ్రీవాణి, వర్ధిని, రికార్డ్ అసిస్టెంట్ లక్ష్మీపతి, అజ్మతుల్లా, టీవీ హరిబాబు, వీరారెడ్డి, విజయ కుమారి, షాహీనా బేగం, ముంతాజ్ బేగం, సునీత, సుభాషిణి, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# తొండూరులో డిజిటల్ సేవలకు కొత్త బాట

### డిజిటల్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడమే లక్ష్యం

### కడప జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం




పులివెందుల /తొండూరు,మహి న్యూస్ సెప్టెంబర్ 1: తొండూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కామన్ సర్వీస్ సెంటర్ కేంద్రాల వెరిఫికేషన్ ప్రక్రియను కడప జిల్లా కామన్ సర్వీస్ సెంటర్ మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం పూర్తి చేశారు. కేంద్రాల పనితీరు, మౌలిక సదుపాయాలు, ప్రజలకు అందిస్తున్న ఆన్‌లైన్ సేవలను ఆయన పరిశీలించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభంగా, వేగంగా అందించడంలో కామన్ సర్వీస్ సెంటర్లు కీలకంగా పనిచేస్తున్నాయని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక ప్రభుత్వ, ప్రైవేట్ సేవలు ఆన్‌లైన్ విధానంలో అందుబాటులోకి రావడంతో ప్రజలు ప్రతి చిన్న పనికోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా స్థానికంగానే సేవలు పొందే అవకాశం కలుగుతోందన్నారు. కామన్ సర్వీస్ కేంద్రాల ద్వారా ఆధార్ సంబంధిత సేవలు, పాన్ కార్డు సేవలు, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, వివిధ ప్రభుత్వ పథకాలకు ఆన్‌లైన్ దరఖాస్తులు, ధృవపత్రాల కోసం దరఖాస్తులు, బ్యాంకింగ్ సేవలు, బీమా తదితర డిజిటల్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉంటాయని తెలిపారు. వెరిఫికేషన్ సందర్భంగా కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవల వివరాలను, అవసరమైన పరికరాలు, ఇంటర్నెట్ సదుపాయం, సేవల నిర్వహణ తీరును పరిశీలించారు.కామన్ సర్వీస్ కేంద్ర నిర్వాహకులు ప్రజలకు నాణ్యమైన సేవలను అందిస్తూ, ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. సేవల విషయంలో పారదర్శకత పాటిస్తూ ప్రజలకు సరైన సమాచారం అందించాలని తెలిపారు.ప్రత్యేకంగా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు డిజిటల్ సేవలపై అవగాహన కల్పించడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆన్‌లైన్ సేవలు మరింత మందికి చేరువ అవుతాయని ఆయన అన్నారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న కామన్ సర్వీస్ కేంద్రాలు నిబంధనలకు అనుగుణంగా పనిచేసేలా వెరిఫికేషన్ ప్రక్రియ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తొండూరు మండలంలో కామన్ సర్వీస్ కేంద్రాల ద్వారా ప్రజలకు మరిన్ని డిజిటల్ సేవలు అందుబాటులోకి రానుండటంతో స్థానికులు, విద్యార్థులు, రైతులు, మహిళలు, వృద్ధులకు ప్రయోజనం కలగనుంది. ప్రజలకు ప్రభుత్వ సేవలను ఇంటి ముంగిటకు తీసుకురావడంలో కామన్ సర్వీస్ కేంద్రాలు వారధిగా నిలుస్తాయని జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. పీవిఎల్ కామన్ సర్వీస్ సెంటర్ పరిశీలిస్తున్న జిల్లా మేనేజర్ సిగా సుబ్రహ్మణ్యం

# క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి చేరాలి

విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలి

కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

చెడు అలవాట్లు, వ్యసనాలకు దూరంగా ఉండాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి సూచించారు. చెడు అలవాట్లు, మత్తు పదార్థాలు, ధూమపానం, మద్యపానం వంటి వ్యసనాలకు దూరంగా ఉండి మంచి మార్గంలో పయనించాలని సూచించారు. మంగళవారం కోడుమూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను కలెక్టర్ పరిశీలించారు. విద్యా బోధన, విద్యార్థుల చదువు, లక్ష్యాల సాధన తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. కళాశాల పరిసరాల్లో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. సంబంధిత ప్ర...

# లబ్ధిదారుల ముంగిటకే ఎన్టీఆర్ భరోసా

జిల్లాలో 2,33,431 మందికి రూ.102.48 కోట్ల పింఛన్ల పంపిణీ

తొలి రోజే 100 శాతం పింఛన్లు పంపిణీ చేయాలి

లబ్ధిదారుల సమస్యలను అడిగి తెలుసుకున్న కలెక్టర్

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): లబ్ధిదారుల ముంగిటకే వెళ్లి ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేస్తున్నామని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి తెలిపారు. సెప్టెంబర్ నెలలో జిల్లాలో అర్హులైన 2,33,431 మంది లబ్ధిదారులకు రూ.102.48 కోట్ల పింఛన్లను పంపిణీ చేస్తున్నట్లు వెల్లడించారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో భాగంగా గోనెగండ్ల మండల కేంద్రంలోని లక్ష్మీపేటలో కలెక్టర్ పర్యటించారు. నవీన్, రాజేష్‌లకు వైకల్య పింఛన్లు, ఈశ్వరయ్య, జానకమ్మ, చంద్రయ్య, నాగేష్‌లకు వృద్ధాప్య పింఛన్లను కలెక్టర్ స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో కలెక్టర్ మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇంట్లో కుటుంబ సభ్యులు ఎలా చూసుకుంటున్నారు, ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని ఆరా తీశారు. ప్రతి నెల పింఛన్ సరైన సమయానికి



అందుతోందా, పింఛన్ పంపిణీ సమయంలో ఎవరైనా డబ్బులు అడుగుతున్నారా, పింఛన్ పంపిణీ చేసే సిబ్బంది ప్రవర్తన ఎలా ఉందనే విషయాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పింఛన్ సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పింఛన్ల పంపిణీలో తొలి రోజే 100 శాతం లక్ష్యాన్ని సాధించాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రావును ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రావు, ఆదోని రెవెన్యూ డివిజనల్ అధికారి అరుణ దేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి మణి మంజరి, ఇన్‌చార్జి తహసీల్దార్ రఘువీర తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటి శుద్ధి కేంద్రం పనులను వేగవంతం చేయాలి

లెగసీ వ్యర్థాల తొలగింపు పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలి

డంపింగ్ యార్డు నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): మురుగునీటి శుద్ధి కేంద్రం పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఎమ్మిగనూరు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణ శివారులోని డంపింగ్ యార్డును, మురుగునీటి శుద్ధి కేంద్రం నిర్వహణను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ పరిధిలోని మురుగునీటి శుద్ధి కేంద్రం పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ కనెక్షన్ అందిన అనంతరం ప్లాంట్‌ను తొలిసారిగా ప్రారంభించగా మోటార్లు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం మోటార్ల పునరుద్ధరణ పనులు చేపట్టామని మున్సిపల్ అధికారులు కలెక్టర్‌కు వివరించారు. మరో మూడు రోజుల్లో అన్ని మోటార్లను ఏర్పాటు చేసి ప్లాంట్‌ను పూర్తిస్థాయిలో ప్రారంభిస్తామని తెలిపారు. ప్లాంట్‌ను ఎలాంటి ఆలస్యం లేకుండా ప్రారంభించి సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. మురుగునీటి శుద్ధి కేంద్రం పూర్తిస్థాయిలో పనిచేసేలా అవసరమైన చర్యలను వెంటనే చేపట్టాలని సూచించారు. అదేవిధంగా డంపింగ్ యార్డులో పేరుకుపోయిన లెగసీ వ్యర్థాలు, అంటే చాలా ఏళ్లుగా పేరుకుపోయిన చెత్త కుప్పల తొలగింపు పనులను కూడా వేగవంతం చేయాలని ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిని కలెక్టర్ ఆదేశించారు. వ్యర్థాలను త్వరితగతిన పూర్తిగా తొలగించి డంపింగ్ యార్డును పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రాజు నాయక్, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మాంసం వ్యర్థాల సేకరణ వేలం పాట వాయిదా

అనివార్య కారణాలతో సెప్టెంబర్ 2న జరగాల్సిన వేలం వాయిదా

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలో చికెన్, మటన్, చేపల వ్యర్థాల సేకరణకు సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహించాల్సిన వేలం పాటను అనివార్య కారణాల వల్ల వాయిదా వేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వాయిదా పడిన వేలం పాటకు సంబంధించిన తదుపరి తేదీ, ఇతర వివరాలను తరువాత తెలియజేస్తామని పేర్కొన్నారు.

# ఇసుక అక్రమ రవాణాపై నిరంతర నిఘా

ప్రతి రవాణాను ప్రత్యేకంగా ధృవీకరించాలి

నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 01: (మహి న్యూస్): ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతరం నిఘా, పర్యవేక్షణ కొనసాగించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి గనుల శాఖ ఉప సంచాలకురాలిని ఆదేశించారు. మంగళవారం నందవరం మండలంలోని గంగవరం, జోహరాపురం ఇసుక రీచ్‌లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఇసుక రీచ్‌ల నుంచి బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఇసుక రవాణాకు సంబంధించిన బిల్లులను, అనుమతులను ప్రత్యేకంగా ధృవీకరించాలని కలెక్టర్ సూచించారు. రోజువారీగా జరిగే ఇసుక రవాణాపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించాలని ఆదేశించారు. బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తిస్తే వెంటనే విచారణ చేపట్టి, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, గనుల శాఖ ఉప సంచాలకురాలు నాగిని, తహసీల్దార్ వాహబ్, ఎంపీడీఓ పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు

కార్యాలయాల్లో రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

పారిశుద్ధ్యం, తాగునీరు, వీధి దీపాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

ప్రతి రోజు మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి





కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, గ్రామస్థాయి సేవల అమలుపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ప్రజలకు సకాలంలో సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని 25వ వార్డులో ఉన్న స్వర్ణ వార్డు కార్యాలయాన్ని, ఎమ్మిగనూరు మండలంలోని కడిమెట్ల-3 స్వర్ణ గ్రామ కార్యాలయాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయ రికార్డులు, హాజరు పట్టిక, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు సంబంధించిన క్యూఆర్ కోడ్‌ను రంగుల ముద్రణతో అన్ని స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల్లో తప్పనిసరిగా ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. కార్యాలయ సిబ్బంది హాజరు కనీసం 85 శాతానికి తగ్గకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. స్వర్ణ గ్రామ కార్యాలయంలో రిజిస్టర్లు, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయంలో లోపలికి వచ్చిన, బయటకు వెళ్లిన ఉత్తరాలు, హాజరు, సందర్శకుల వివరాలు, సమాచార హక్కు చట్టం, ప్రజా ఫిర్యాదుల వ్యవస్థ, ఆస్తి పన్ను, నిల్వల రిజిస్టర్ తదితర రికార్డులను క్రమబద్ధంగా నిర్వహించాలని ఆదేశించారు. రిజిస్టర్ల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. డ్రైన్లు, మురుగు కాలువలను ప్రతిరోజూ పరిశీలించి శుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరమ్మతులకు గురైన వీధి దీపాలను గుర్తించి తొలగించి వాటి స్థానంలో కొత్త దీపాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తీవ్ర పౌష్టికాహార లోపం ఉన్న చిన్నారులు, ఎదుగుదల లోపం, తక్కువ బరువు వంటి సమస్యలతో ఉన్న పిల్లల వివరాలు తెలియకపోవడంపై కలెక్టర్ సంబంధిత సిబ్బందిని ప్రశ్నించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సిబ్బంది క్రమం తప్పకుండా సందర్శించి పిల్లల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ముఖ్యంగా తక్కువ బరువు ఉన్న పిల్లల ఇళ్లకు వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి అవసరమైన చర్యలు చేపట్టాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు అధికారి భాస్కర్ నాయుడు, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, ఎంపీడీఓ బంగారమ్మ, తహసీల్దార్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలి

పీఎంఈజీపీ, పీఎంఎఫ్ఎంఈ పథకాలతో ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్ల పరిశీలన

ఉత్పత్తి, విక్రయాలు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలి

ప్రభుత్వ రుణాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి






కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): ప్రభుత్వం అందిస్తున్న రుణాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి ఆకాంక్షించారు. స్వయం ఉపాధి యూనిట్లను సమర్థవంతంగా నిర్వహిస్తూ స్థిరమైన ఆదాయం పొందేలా ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని సూచించారు. మంగళవారం గోనెగండ్ల మండల కేంద్రంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల కింద ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను కలెక్టర్ తనిఖీ చేశారు. పీఎంఈజీపీ కింద ఏర్పాటు చేసిన ఏ-4 పేపర్ కటింగ్ యూనిట్, పీఎంఎఫ్ఎంఈ కింద నిర్వహిస్తున్న పిండి మర, స్వయం సహాయక సంఘాల రుణాలతో ఏర్పాటు చేసిన అస్మా శారీస్ దుకాణాన్ని సందర్శించారు. యూనిట్ల నిర్వహణ, ఉత్పత్తి, విక్రయాలు, ఆదాయం, రుణాల చెల్లింపులపై లబ్ధిదారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా రుణాలు, సబ్సిడీలు పొందిన లబ్ధిదారులు యూనిట్లను సమర్థవంతంగా నిర్వహించి లాభదాయకంగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ సూచించారు. ఉత్పత్తి వ్యయం, మార్కెటింగ్, విక్రయాలు, రుణ వాయిదాల చెల్లింపులపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని తెలిపారు. స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకుని యువత, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు.

పేపర్ కటింగ్ యూనిట్ పరిశీలన

గోనెగండ్లలో కాజా మున్నిసా నిర్వహిస్తున్న పేపర్ కటింగ్, బండిల్ తయారీ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పీఎంఈజీపీ పథకం కింద యూనిట్‌కు రూ.10 లక్షల రుణం మంజూరైందని, రూ.3.50 లక్షల వరకు సబ్సిడీ లభిస్తుందని నిర్వాహకులు తెలిపారు. పేపర్ రోల్స్ సేకరణ, ఏ-4 పేపర్ తయారీ, నెలవారీ నిర్వహణ ఖర్చులు, విక్రయాలపై కలెక్టర్ ఆరా తీశారు. ఉత్పత్తి, పెట్టుబడి, నిర్వహణ ఖర్చులను సమగ్రంగా లెక్కించి యూనిట్‌ను లాభదాయకంగా అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వివిధ శాఖలకు నాణ్యమైన ఏ-4 పేపర్ సరఫరా చేసే అవకాశాలను వినియోగించుకోవడంతోపాటు స్థానిక మార్కెటింగ్ అవకాశాలను సద్వినియోగం చేసుకుని యూనిట్‌ను విస్తరించుకోవాలని తెలిపారు.

పిండి మర యూనిట్ పరిశీలన

అనంతరం ఫాతిమా నిర్వహిస్తున్న పిండి మర, అల్లం-వెల్లుల్లి పేస్ట్ తయారీ, కారం మిల్లు యూనిట్లను కలెక్టర్ పరిశీలించారు. యూనిట్ నిర్వహణ, ఆదాయం, ఖర్చులు, రుణాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మొత్తం ప్రాజెక్టు వ్యయం సుమారు రూ.3.82 లక్షలు కాగా, పీఎంఎఫ్ఎంఈ రుణంగా రూ.1.82 లక్షలు, బ్యాంకు రుణంగా రూ.50 వేల సమకూర్చుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పిండి మరతో పాటు పాలు, పెరుగు విక్రయాల ద్వారా ఆదాయ వనరులను విస్తరించుకోవడం అభినందనీయమని కలెక్టర్ పేర్కొన్నారు. ఉత్పత్తుల నాణ్యత, పరిశుభ్రత, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించి వ్యాపారాన్ని మరింత అభివృద్ధి చేసుకోవాలని సూచించారు.

చీరల దుకాణం పరిశీలన

గోనెగండ్లలో స్వయం సహాయక సంఘాల రుణాల సహకారంతో షహజాది ఏర్పాటు చేసుకున్న అస్మా శారీస్ దుకాణాన్ని కూడా కలెక్టర్ పరిశీలించారు. చీరలు, సిద్ధంగా ఉన్న దుస్తుల విక్రయాల ద్వారా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకురాలు వివరించారు. వ్యాపార విస్తరణ కోసం బ్యాంకు రుణం, స్త్రీ నిధి రుణం, ముద్ర రుణం తదితర ఆర్థిక వనరులను వినియోగించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నెలకు సుమారు రూ.20 వేల నుంచి రూ.30 వేల వరకు ఆదాయం వస్తోందని పేర్కొన్నారు. స్వయం ఉపాధి ద్వారా మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించడం అభినందనీయమని కలెక్టర్ అన్నారు. వ్యాపార అవసరాలకు అనుగుణంగా అందుబాటులో ఉన్న ప్రభుత్వ పథకాలు, రుణాల మంజూరు అవకాశాలను పరిశీలించి అర్హులైన వారికి ప్రయోజనాలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ అరుణా దేవి, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీధర్ రావు, ఉప తహసీల్దార్ రఘువీర్, ఎంపీడీఓ మణి మంజరి తదితరులు పాల్గొన్నారు.

# నగరాభివృద్ధికి రహదారులే రథచక్రాలు

4 కిలోమీటర్ల మేర రూ.2.23 కోట్లతో బీటీ రోడ్డు పునరుద్ధరణ

14 కూడళ్లలో రహదారి భద్రత సూచికల ఏర్పాటు

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు




కర్నూలు, సెప్టెంబర్ 01 (మహి న్యూస్): నగర అభివృద్ధిలో రహదారులు కీలక పాత్ర పోషిస్తాయని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు పేర్కొన్నారు. ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలు కల్పించడంతోపాటు నగర రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచేలా రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంగళవారం కొండారెడ్డి బురుజు వద్ద చేపడుతున్న బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులను కమిషనర్ పరిశీలించారు. కొండారెడ్డి బురుజు నుంచి కోట్ల విజయభాస్కరరెడ్డి కూడలి, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్ మీదుగా వై. జంక్షన్ వరకు సుమారు 4 కిలోమీటర్ల మేర రూ.2.23 కోట్ల



వ్యయంతో బీటీ రోడ్డు పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు తెలిపారు. వీటితోపాటు 14 కూడళ్లు, ప్రధాన రహదారుల వెంట అవసరమైన ప్రాంతాల్లో నగరపాలక సంస్థ సాధారణ నిధుల నుంచి రూ.30 లక్షల వ్యయంతో రహదారి గుర్తులు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. మధ్య రేఖలు, అంచు రేఖలు, మార్గ రేఖలు, పాదచారుల దాటివెళ్లే ప్రాంతాల గుర్తులు, వేగ నియంత్రణ పట్టీలు తదితర సూచికలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ సూచికల ద్వారా వాహనదారులు, పాదచారులకు స్పష్టమైన మార్గదర్శకత్వం లభించడంతోపాటు రహదారి భద్రత మరింత మెరుగుపడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. చేపడుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. మెరుగైన రహదారులు, క్రమబద్ధమైన రవాణా వ్యవస్థతో నగరాన్ని మరింత సుందరంగా, సురక్షితంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్న క్యాంటీన్‌ను కమిషనర్ తనిఖీ చేశారు. క్యాంటీన్ నిర్వహణలో పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రజలతో మర్యాదగా వ్యవహరించాలని నిర్వాహకులకు సూచనలు చేశారు.

# అన్న క్యాంటీన్లలో నాణ్యమైన రుచికరమైన భోజనం అందించాలి

పరిశుభ్రమైన వాతావరణంలో ఆహారం అందించాలి

ప్రజలతో మాట్లాడి భోజనం నాణ్యతపై ఆరా తీసిన కలెక్టర్ డా. ఏ. సిరి



కర్నూలు, సెప్టెంబర్ 01: (మహి న్యూస్): అన్న క్యాంటీన్ల ద్వారా ప్రజలకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ డా. ఏ. సిరి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఎమ్మిగనూరు పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలో ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్‌ను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాంటీన్‌లో అందిస్తున్న భోజనం నాణ్యత, పరిశుభ్రత, నిర్వహణ, సేవలను పరిశీలించారు. అన్న క్యాంటీన్‌లో భోజనం చేస్తున్న ప్రజలతో కలెక్టర్ మాట్లాడి భోజనం రుచిగా ఉందా, సరిపడేంతగా అందిస్తున్నారా, ప్రతిరోజూ సమయానికి క్యాంటీన్ తెరుస్తున్నారా, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారా అనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. భోజనం రుచిగా ఉంటోందని, సరిపడేంతగా అందిస్తున్నారని, సమయానికి క్యాంటీన్ తెరుస్తున్నారని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతున్నారని ప్రజలు కలెక్టర్‌కు తెలిపారు. అన్న క్యాంటీన్‌కు వచ్చే ప్రతి ఒక్కరికీ నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని పరిశుభ్రమైన వాతావరణంలో అందించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆహార నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ లేకుండా పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆదోని ఆర్డీఓ అరుణ దేవి, మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఒకటో తేదీనే పింఛన్లు

సెప్టెంబర్‌లో 94.87 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి

నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు



కర్నూలు, సెప్టెంబర్ 01: (మహి న్యూస్): నగరంలోని అర్హులైన వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు తదితరులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతంలా ప్రభుత్వం పింఛన్ అందజేస్తోందని నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా ఓబులేసు తెలిపారు. మంగళవారం గౌలిగేలి ప్రాంతంలో లబ్ధిదారులకు పింఛన్ నగదును అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రతి నెలా ఒకటో తేదీన సుమారు 95 శాతం, రెండో తేదీన సుమారు 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తవుతుందని తెలిపారు. లబ్ధిదారులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పింఛన్ అందుకోలేకపోయిన వారికి తదుపరి నెలలో రెండు నెలల పింఛన్ మొత్తాన్ని కలిపి అందజేస్తున్నట్లు వివరించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి ఒకటో తేదీనే 94.87 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందని తెలిపారు. అందుబాటులో లేక పింఛన్ అందుకోలేకపోయిన లబ్ధిదారులకు రెండో తేదీన పింఛన్ అందజేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీపీఓ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



EDITOR and PUBLISHER and OWNED BYNEELI RAMASUBBAIAH, PUBLISHED AT# 87/985-V-P-C-29,VIJAYAPURICOLONY, BESIDE KENDRIYAVIDYALAYASCHOOL,NEAR NADHYALCHECKPOST, KURNOOL-518001, A.P PRINTED ATVSAR PRINTERS, KURNOOL-518001.RNI NO : APTEL/26/A3560. Cell 90 59 58 58 98. Email :mahinewsindia@gmail.com, website : https//epaper.mahinewsindia.com